క్లుప్తంగా

నగర సంకీర్తనలు



నగరసంకీర్తనలో పాల్గొన్న భక్తులు

సింహాద్రిపురం : ప్రొద్దుటూరు ఇస్కాన్ వారి ఎద్దులరథంతో సనాతన ధర్మం భగవద్గీత భాగవతం గురించి వివరిస్తూ సింహాద్రిపురంలో ఆదివారం సాయింత్రం నగరసంకీర్తన చేశారు. హరే రామ హరే కృష్ణకృష్ణ హరే హరే సంకీర్తనలతో భగవద్గీత పుస్తకాలను ఇస్కాన్ ప్రవచకులు పూరవీదులలో సంకీర్తనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా సనాతనధర్మం గురించి తెలియజేస్తూ ప్రతి ఒక్కరిలో శ్రీకృష్ణుడి లీలలను ధర్మప్రచారం వివరిస్తూ ఈ సంకీర్తన కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. దాత యాగంటి బాలకృష్ణారెడ్డి ప్రసాద వితరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు స్మార్ట్ కిచెన్ సెంటర్ ఏర్పాటుకు భూమి పూజ

లింగాల : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో స్మార్ట్ కిచెన్ నిర్మాణానికి సోమవారం మార్కింగ్ ఇచ్చి భూమిపూజ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఏఈ మనోహర్రెడ్డి తెలిపారు. ఈ కిచెన్ సెంటర్ ద్వారా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్నం భోజనాన్ని పంపేందుకు ఏర్పాట్లు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, ఎంఈఓ, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్రెడ్డి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఎర్రమాసుపల్లెకు చెందిన మండల వైఎస్సార్సీపీ నాయకుడు కొవ్వూరు నాగమల్లారెడ్డి సోదరుడి కుమారుడు శివనాగమునిరెడ్డి వివాహం ఆదివారం ఫాతిమా మెడికల్ కళాశాల సమీపంలోని మహాలక్ష్మి కల్యాణ మండపంలో జరిగింది. ఈ వివాహ వేడుకకు వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి హాజరై నూతన వధూవరులు శివనాగమునిరెడ్డి, నవ్యలను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, నిమ్మకాయలు, వేపాకులు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తు లు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నా రు. బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే గంగమ్మ దేవాలయం సమీపంలోని వీరభద్రస్వామి, వై ద్యనాధీశ్వర ఆలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా దేవాలయాలలో పూజలు చేశారు.

రైతుల గోడు కూటమి ప్రభుత్వానికి పట్టదా?

రాజుపాళెం : రైతులు పండించిన దిగుబడులు అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని గతంలో సీఎం చంద్రబాబు చెప్పారని, అయితే ఆ కేంద్రాలు ఎక్కడున్నాయో కనిపించడం లేదని వైఎస్సార్సీపీ రైతు జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి ఎద్దేవాచేశారు. ఆయన రాజుపాళెంలో ఆదివారం మాట్లాడుతూ అరటి, బొప్పాయి, ఉల్లి పంటల దిగుబడులకు కొనుగోలు సెంటర్లు ఏర్పాటు చేశామని మాటలకే పరిమితమైందన్నారు. అయితే పంటల దిగుబడులు పూర్తవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదని విమర్శించారు. ఈ విషయాన్ని సంబంధిత మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లిన దాఖలాలు కూడా లేవన్నారు. ప్రజా ప్రతినిధులు పల్లెలోకి వెళితే రైతులు నిలదీసే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో రైతులు పడరాని పాట్లు పడుతున్నారని, పంటలు పండించాక దిగుబడులు అమ్ముకోలేక వాటిని పొలాల్లోనే వదిలేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం పంటలు సాగు చేసిన రైతులకు పంటలకు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని, రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

అస్తవ్యస్తంగా పారిశుద్ధ్య నిర్వహణ

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి చెత్త నిర్వహణ కేంద్రాలు అన్ని పంచాయతీల్లోనూ ఏర్పాటు చేశారు. అయితే ఈ కేంద్రాలను పట్టించుకునే వారు లేరు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. కొన్ని చోట్ల యంత్రాలు సమాకూర్చారు కానీ అందులో చెత్తనే వేయకుండానే, అసలు చాలా గ్రామాల్లో చెత్తను సేకరించకుండానే మేనేజ్ చేస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. చెత్త సేకరణ సరిగా జరుగకపోవడంతో ప్రజలు సైతం కొన్ని చోట్ల బాధ్యత మరచి కాలువల్లో, రోడ్లపై వేస్తుండటంతో కాలువలు చెత్తతో పూడిపోయి వర్షపు నీరు వెళ్లక దుర్గంధం వెదజల్లుతున్నాయి. అపరిశుభ్రతతో ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం కల్పిస్తుంది. కొన్ని పంచాయతీలలో గ్రామాల సమీపంలో డంప్ చేసి రోడ్ల పక్కన, వంకలలో వేసి కాలుస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ గాలికి వదిలి వేశారని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి, ఇప్పటికైనా స్పందించి సక్రమంగా పారిశుద్ధ్యాన్ని నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



బోడెద్దులపల్లెలో మసీదు ఎదురుగా పేరుకుపోయిన చెత్త



ఇప్పపెంట పంచాయతీ బోడెద్దుల గ్రామం వద్ద చెత్తను పేర్చి కాల్చాచారు



కొలుముపల్లె తూర్పు వంకలో చెత్తను డంప్ చేసిన దృశ్యం



నిరుపయోగంగా యంత్రాలతో కూడిన చింతకొమ్మదిన్నె చెత్త సంపద కేంద్రం



జమాల్పల్లె సమీపంలో చెత్తతో నిండిన ప్రధాన కాలువ

నేడు కల్తీ మద్యంపై నిరసన

పులివెందుల : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం పులివెందులలో కల్తీ మద్యం సరఫరాపై నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు వైఎస్సార్సీపీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్తీ మద్యం ఏరులై పారుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందన్నారు. అందుకు నిరసనగా పార్టీ అధ్యక్షుడు సూచనల మేరకు సోమవారం ఉదయం 9 గంటలకు పులివెందులలోని పాత ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ర్యాలీగా బోలే వార్డు, పాత ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ మీదుగా వెళ్లి అంబకపల్లి రోడ్డులో ఉన్న ఎక్సైజ్ ఆఫీసు ఎదురుగా నిరసన కార్యక్రమం చేపట్టి అనంతరం ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండాపురం : మండలంలోని సంకేపల్లెలో ఆదివారం పేకాట ఆడుతున్న ఏడు మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.4290 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ ఆర్.శివనాగిరెడ్డి తెలిపారు.

రాష్ట్రస్థాయి ఈసీ సభ్యుడిగా రమేష్నాయక్

వేంపల్లె : ఆల్ ఇండియా బంజారా సేవా సంఘంలో రాష్ట్రస్థాయి ఈసీ సభ్యుడిగా వేంపల్లి మండలం బక్కన్నగారిపల్లెకు చెందిన బుక్కే రమేష్నాయక్ను నియమించారు. ఆదివారం విజయవాడలోని మాకేనేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆలిండియా బంజారా సేవా సంఘంలో పదవీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని తన పదవికి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి, వారి సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రస్థాయి ఈసీ సభ్యులుగా నియమించి ప్రోత్సహించిన అధ్యక్షుడు రిటైర్డ్ డీఐజీ డి.టి. నాయక్, సంఘ అధ్యక్షుడు చక్రినాయక్లకు కతజ్ఞతలు తెలియజేశారు.



నియమితులైన రమేష్నాయక్ తదితరులు

శాంతి భద్రతలకు సహకరించండి

ఎర్రగుంట్ల : గ్రామాలలో శాంతి భద్రతలను కాపాడటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ సీఐ విశ్వనాథ్రెడ్డి కోరారు. వై కోడూరులో పోలీసుల బృందంతో ఆయన రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ గ్రామం సీ కెటగిరి ఫ్యాక్షన్ గ్రామంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగమురళి, సిబ్బంది పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ

వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలి

వేంపల్లె : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ బోర్డు భూములను పరిరక్షించాలని మైనార్టీ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ దస్తగిరి, అధికార ప్రతినిధి డాక్టర్ ఇబ్రహీంలు తెలిపారు. ఆదివారం కర్నూలులో ఉన్న మైనార్టీ, న్యాయ శాఖమంత్రి ఫరూఖ్ను మైనార్టీ రైట్స్ ఫోరం నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే మైనార్టీలకు సంబంధించిన పలు సమస్యలపై మంత్రితో చర్చించారు. మైనార్టీ రుణాలతో పాటు ముస్లిం పేద విద్యార్థులకు స్కాలర్షిప్లు మంజూరు చేయాలని కోరారు. అలాగే వక్ఫ్ బోర్డుకు సంబంధించి స్థలాలు చాలా అన్యాక్రాంతం అయ్యాయని వాటిని భూ కబ్జాదారుల నుంచి రక్షించాలని కోరారు. వేంపల్లెలోని ఉర్దూ కళాశాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు సహకారం చేయాలని కోరారు. కడప అమీన్ పీర్ దర్గాకు చెందిన ఉరుసు మహోత్సవం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలోనే జరిగేలా చూడాలని కోరారు. వక్ఫ్బోర్డు అనుమతి లేకుండా ఇష్టానుసారంగా పెద్ద దర్గా ఉరుసును నిర్వహించి అందినంత దోచుకుంటున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. ఉరుసు ఉత్సవాలకు సంబంధించి బహిరంగా టెండర్లు పిలిచి వక్ఫ్బోర్డు ఆదాయం పెంచాలని కోరారు. దీంతో మంత్రి ఫరూఖ్ మాట్లాడుతూ మైనార్టీ రైట్స్ ఫోరం ప్రతినిధులు తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులో ఉన్న దారుల్ ఉలూమ్ రహమానీయ మసీదు ఆవరణలో చేపట్టిన ఉచిత గుండె వైద్య శిబిరానికి రోగుల నుంచి విశేష స్పందన లభించినట్లు మదరాసా ప్రతినిధులు తెలిపారు. ఆదివారం చెన్నైకు చెందిన ఆక్సిమెండ్ హాస్పిటల్ సహకారంతో దారుల్ ఉలూమ్ రహమానీయ మదరాసా ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్యులు ఆయాజ్ అక్బర్, సామా అక్బర్లు రోగులకు వైద్య పరీక్షలు చేపట్టారు. మందులు ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు 250 మంది రోగులు వచ్చి పరీక్షలు చేయించుకున్నట్లు మదరాసా ప్రతినిధులు తెలిపారు. రక్త పరీక్షలు, బీపీ తదితర పరీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, మదరాసా కమిటీ ప్రతినిధులు, మదరసా విద్యార్థులు పాల్గొన్నారు.

మహిమ గల దిగుడుబావి

సింహాద్రిపురం : మండలంలోని గురిజాల గ్రామంలో ఎంతో మహిమ గల అతిపురాతన దిగుడుబావి ఉంది. ప్రస్తుతం ఆ బావి అంతరించిపోకుండా గ్రామస్తులు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ దిగుడు బావిలోకి అప్పటి కాలంలోనే ఎంతో నైపుణ్యంతో వర్షపు నీరు వచ్చి చేరేటట్లు తూమును ఏర్పాటు చేశారు. అలాగే దిగుడు బావికి చుట్టూ రాతికట్టడం ఏర్పాటు చేశారు. మొదట్లో 20 అడుగుల మేర ఏటవాలుగా రాతితో బండ చప్పట పరిచారు. బావిలో 44 మెట్లు ఏర్పాటు చేశారు. అక్కడ మళ్లీ మెట్ల లోతులో తాళ్ల సహాయంతో నీటిని చేదుకోవడానికి పెద్ద బండలను ఏర్పాటు చేశారు.

ఎప్పటికీ బావిలో ఇంకిపోని నీరు

దిగుడు బావిలో ఎప్పటికీ నీరు ఇంకిపోకుండా పూర్వం అవధూత కోడిమూర్తి భయ్యా రెడ్డిస్వామి నీటిపై తపస్సు చేస్తూ ఆ నీటిని మంత్రించి ఉండటంతో ఈ బావి నీటిని పవిత్రమైన నీరుగా ప్రజలు భావిస్తారు. గ్రామంలో పూర్వీకుల కాలం నుంచి ఎవరికైనా పాము కరచినా, అనారోగ్య సమస్యలు వచ్చినా దిగుడు బావి వద్ద ఉన్న పురాతన రాతి స్తంభాలతో ఏర్పాటు చేసిన కమ్మల కట్టమీద మూడు రోజులపాటు నియమ నిష్ఠలతో నీరు తాగితే రోగాలు నయమవుతాయని ఇప్పటికీ గ్రామస్తులు నమ్ముతారు. ఇప్పటికీ కూడా ఈ ఆచారం గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. ఈ బావిని గ్రామస్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. అయితే ఈ బావి భావితరాల వారికి అంతరించి పోకుండా పదిలంగా ఉండాలని గ్రామానికి చెందిన చెన్నంరెడ్డి వంశీకులు బావి కట్టడాలను పునర్మించారు.



గురిజాల గ్రామంలోని పురాతన దిగుడు బావి

17న మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 17వ తేదీన జరుగుతుందని ఎంపీడీవో రఘురాం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ సమావేశంలో వ్యవసాయం, ఉద్యాన వనశాఖ, విద్య, వైద్య ఆరోగ్యం, తాగు నీరు, పారిశుద్ధ్యం, ఉపాధి హామీ పథకం మొదలైన అంశాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్లు, జడ్పీటీసీలు తప్పకుండా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



సురేష్ మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న సీఐ విశ్వనాథ్రెడ్డి

ఎర్రగుంట్ల : పట్టణంలోని రైల్వే క్యాంటిన్లో పని చేస్తు ఉరి వేసుకుని మృతి చెందిన కంభం సురేష్ మృతదేహానికి పట్టణ సీఐ విశ్వనాథ్రెడ్డి అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. జమ్మలమడుగు పట్టణంకు చెందిన కంభం సురేష్ ఆర్థిక పరిస్థితులు, వ్యక్తిగత కారణాల వల్ల రైల్వే క్యాంటిన్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహం కోసం తన కుటుంబ సభ్యులు ఎవరూ రాక పోవడంతో మే ఐహెల్ప్యూ వారి సహకారంతో రామేశ్వరం సమీపంలోని పెన్నానది ఒడ్డున అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

గాంధేయ మార్గంలో శాంతియుత నిరసన

ప్రొద్దుటూరు : నకిలీ మద్యాన్ని అరికట్టాలని కోరుతూ సోమవారం ఉదయం 9 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి జమ్మలమడుగు రోడ్డులోని ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ గాంధేయ మార్గంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఎవరిని దూషించకుండా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. నకిలీ మద్యం తయారీలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉన్న కారణంగా పేద ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులు కార్యక్రమానికి తరలి రావాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం తాగి ఎంతో మంది పేద, మధ్య తరగతి ప్రజలు చనిపోవడం, అనారోగ్యానికి గురికావడం జరుగుతోందన్నారు. ప్రభుత్వంపై నకిలీ మద్యాన్ని అరికట్టాల్సిన బాధ్యత ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు, వైఎస్సార్సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే దేశాభివృద్ధి జరుగుతుందని ఆర్ఎస్ఎస్ విభాగం కార్యకర్త రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం సరస్వతి విద్యామందిరం మైదానంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1925లో విజయదశమి రోజు డాక్టర్ కేశవరామ్ బలిరామ్ హెడ్గేవార్ ఆర్ఎస్ఎస్ను ప్రారంభించి 100 సంవత్సరాలు అయిందన్నారు. విజయదశమి ఉత్సవంలో భాగంగా ఆయుధ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ సర్వేశ్వర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ కడప జిల్లా ఫిజికల్ డైరెక్టర్ శ్రీకాంత్, రిటైర్డ్ ఎంపీడీవో రాఘవరెడ్డి, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, హిందూ సంఘాల నాయకులు పాఠశాల కమిటీ ప్రధాన కార్యదర్శి దినేష్కుమార్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ విభాగం కార్యకర్త రామచంద్రారెడ్డి

ఆర్టీసీ సిబ్బందికి పదోన్నతులు కల్పించాలి

జమ్మలమడుగు రూరల్ : కొంతకాలంగా పెండింగ్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి ప్రభుత్వం పదోన్నతులు కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య కోరారు. ఆదివారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో డిపో కార్యదర్శి జె.ఫాజిల్బాషా ఆధ్వర్యంలో డిపో అధ్యక్షుడు ఆర్.గంగిరెడ్డి అధ్యక్షతన ఆర్టీసీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులుగా ఉన్న వారిని గుర్తించి పదోన్నతులు కల్పించలేదని ఆయన విమర్శించారు. 6 వేల మంది ఆర్టీసీ కార్మికులకు దీపావళి పండుగలోగా పదోన్నతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్ఎంయూ నుంచి దాదాపు 30 మంది సభ్యులు ఎంప్లాయిస్ యూనియన్లో చేరినట్లు ఆయన తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. డిపో అధ్యక్షుడిగా ఆర్.గంగిరెడ్డి డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ డి.పి.రెడ్డి, డిపో చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జె.ఫాజల్బాషా, డిపో కార్యదర్శి కె.శివుడు, డిపో ట్రెజరర్ శేఖర్, గ్యారెజ్ సెక్రటరీ బి.సి.ఆర్. ఎస్రెడ్డి, మరో 10 మందిని డిపో కమిటీలోకి తీసుకున్నారు.



ఎంప్లాయిస్ యూనియన్లోకి చేరిన మజ్దూర్ యూనియన్ సిబ్బంది

గోవులకు రక్షణ కరువు

- గాయాలపాలవుతున్న గోమాతలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీలో ఎక్కడ చూసినా గోవులు దర్శనమిస్తున్నాయి. గో యజమానులు వాటిని పట్టించుకోకుండా రోడ్లపైకి వదులుతున్నారు. వాటిని సంరక్షించాల్సినవారు వాటి ఆలనా పాలనా చూసుకోకుండా రోడ్లపైకి వదలడంతో పులివెందులలో ఎక్కడ పడితే అక్కడ ఆవులు రోడ్లపై సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అంతేకాకుండా ఆవులు గాయాలపాలవుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి గోవుల యజమానులను పిలిపించి ఆవులు రోడ్లపైకి రాకుండా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి గోవులు రోడ్లపై లేకుండా వాటిని గోషాలకు తరలించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఆహారం లేక దుకాణలలోకి, ఇళ్లలోకి చొరబడుతున్నాయని అంటున్నారు.



వీధులలో గుంపులుగా వెళుతున్న ఆవులు

క్రమశిక్షణకు మారుపేరు ఆర్ఎస్ఎస్

చాపాడు : వందేళ్ల కిందట ఆవిర్భవించిన ఆర్ఎస్ఎస్ దేశ భక్తి, క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు గూడూరు రవికుమార్ తెలిపారు. మండలంలోని వెదురూరు శివాలయంలో ఆదివారం ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందుత్వం కోసం వెలసిన ఆర్ఎస్ఎస్ సమాజ హితం కోసం పనిచేస్తోందన్నారు.

పాపాఘ్ని నదికి చేరిన వరద నీరు

- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- నదిలోకి వెళ్లరాదంటున్న పోలీసులు

వేంపల్లె : ఎగువ ప్రాంతాల్లో వర్షాలు బాగా కురవడంతో పాపాఘ్ని నదిలో వరద నీరు ఉధృతంగా పారుతోంది. నదిలో ప్రవహిస్తున్న నీటిని చూసేందుకు ప్రజలు భారీ ఎత్తున వెళ్తున్నారు. పాపాఘ్ని నది వరద నీటితో కళకళ లాడుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా పాపాఘ్ని నదిలో నీరు ప్రవహించకుండా పోవడంతో వ్యవసాయానికి చెందిన బోర్లల్లో నీటీ మట్టం తగ్గిపోయింది.

నదిలో ఉన్న తాగునీటి బోర్ల నీటిమట్టం తగ్గి పోవడంతో సాగునీటికి అటు తాగునీటికి రైతులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇంక ఒక సంవత్సరం వరకు నీటి కొరత లేకుండా ఉంటుందని ప్రజలు అంటున్నారు. ఆదివారం పాపాఘ్ని నదికి ఒక్కసారిగా నీటి శాతం పెరగడంతో నది వద్దకు ప్రజలు వెళ్లరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఎక్కువ కాలం నది ప్రవహించక పోవడంతో ఇసుక తవ్వకాలు ఎక్కువగా జరిగి నది అంతా గుంతలు ఏర్పడ్డాయి. నీటిని చూసేందుకు నదిలోకి వెళ్లిన వారు ప్రమాదవశాత్తు గుంతల్లో పడే అవకాశం ఉందని నదిలోకి దిగరాదని సీఐ నర్సింహులు ప్రజలకు తెలిపారు. వేంపల్లె నుంచి అలిరెడ్డిపల్లికు వెళ్లే పాత రహదారిలో నీటి మట్టం పెరిగింది. వేంపల్లి, వీరన్నగట్టుపల్లె, అలిరెడ్డిపల్లె బ్రిడ్జిలపై నుంచి ప్రజలు తిలకిస్తున్నారు. వీరన్నగట్టుపల్లె వద్ద జాతీయ రహదారికి చెందిన బ్రిడ్జి పనులకు ఆటంకం నెలకొంది. నెల వరకు బ్రిడ్జి పనులు చేసేందుకు అవకాశం లేదని పలువురు చెబుతున్నారు.

